క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిధిలోని అన్ని గ్రామాల పరిధిలో 13వ తేదీ రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఏఈ పి.వెంకట సుదీర్ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయటం కోసం రెండో శనివారం 13న ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ సుధీర్ తెలియజేశారు. చేబ్రోలు, వడ్లమూడి విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



తెనాలిరూరల్: మండలంలోని అంగలకుదురు గ్రామానికి చెందిన మాజీ జవాను నలుకుర్తి రవి ఆధ్వర్యంలో గ్రామ ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు జామెంట్రీ బాక్సులను శుకవారం పంపిణీ చేశారు. పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, సుద్దపల్లి నాగరాజు, అత్తోట శరత్, న్యాయవాదులు, ఇందుపల్లి రాజారాం, సుద్దపల్లి మురళి, మందా జనార్ధనరావు, సోమశేఖరరావు, కుమార్, ఏసోబు తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థుల ఎంపిక

కొల్లిపర: 2023–24లో 10వ తరగతి పూర్తి చేసుకున్న మండల పరిధిలోని అత్తోట గ్రామంలోని కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గురు, మున్నంగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ముగ్గురికి ట్రిపుల్ ఐటీలో స్థానం దక్కిందని అత్తోట ప్రధానోపాధ్యాయురాలు వై.బారతి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని అత్తోట హైస్కూలో జరిగిన సమావేశంలో భారతి మాట్లాడుతూ హైస్కూల్‌కు చెందిన వై.లక్ష్మీపూజిత, చందు మేఘన, వై.నాగసత్యం, మున్నంగి హైస్కూల్‌కు చెందిన కె.వివేక్, సిరిచైతన్య, రాగసుస్మిత లు గురువారం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీకీ ఎంపికైన వారిని వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

భవిత కేంద్రానికి కుర్చీలు వితరణ



కొల్లిపర: భవిత కేంద్రంలోని విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండనటానికి కొల్లిపర గ్రామానికి చెందిన భీమవరపు వేణుగోపాల రెడ్డి శుక్రవారం ఎంఈవో 1, 2 సాల్మన్‌రాజ్, ఝాన్సీలత సమక్షంలో భవిత కేంద్రంలో 16 కుర్చీలు, 2 టేబుల్స్, ఫిజియోథెరఫికి సంబంధించిన పరికరాలు అందించారు. ఈ సందర్భంగా దాత వేణుగోపాలరెడ్డి గురించి ఎంఈవోలు మాట్లాడుతూ భవిత కేంద్రంలో అంగవైకల్యంతో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల గురించి ఆలోచించి వారికి ఉపయోగకరంగా కుర్చీలు, వ్యాయామం కోసం పరికరాలు అందించటం అభినందనీయమన్నారు. అనంతరం భవిత కేంద్రం ఉపాధ్యాయులు దాత వేణుగోపాల రెడ్డిని శాలువాతో, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరఫి ఉపాధ్యాయులు ఎం.శివనాగమల్లేశ్వర రావు, ఉపాధ్యాయులు పి.మృత్యుంజయరావు, డి.సురేష్‌బాబు, కె.పాపయ్య, ఎంఐఎస్ ఎస్.రమేష్, సీఆర్‌పీలు పి.రమేష్‌బాబు, మురళీ, ఆయా నాగమణి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



లక్ష్మీపురం: రాష్ట్రంలో ఆస్తి పన్ను ఏటా 15 శాతం పెరుగుదలను తక్షణమే నిలిపి వేయాలని, ఆస్తి పన్ను సవరణ చట్టంను రద్దు చేయాలని.. ఆస్తి పన్ను చెల్లింపు దార్ల విస్తృత సమావేశం ద్వారా రాష్ట్ర ప్రభత్వానికి విజ్ఞాప్తి చేస్తున్నామని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సిటీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.ఎస్ మూర్తి పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అద్దె విలువ మీద ఆస్తి పన్ను లెక్కించే విధానాన్ని రద్దు చేసి, ఆస్తి విలువ మీద పన్ను లెక్కించే విధానాన్ని ప్రవేశ పెట్టిందని గుర్తుచేశారు. దీని కోసం మున్సిపల్ చట్టాలను సవరణ చేస్తూ సవరణ చట్టంను తెచ్చిందని తెలిపారు.

మందు బాబులకు అడ్డా... రైల్వే స్టేషన్ రోడ్డు



రైల్వే స్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద మందు బాబులు (మద్యం దారుల క్యూలైను)



చెట్లతో నిండి అధ్వాన్నంగా ఉన్న డివైడర్

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం
- అధ్వాన్నంగా పారిశుధ్యం.. రోడ్డంతా చెట్లు, వ్యర్థాలు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పొన్నూరు: రైలు ప్రయాణికుల సౌకర్యార్థం ఇటీవల కోట్ల రూపాయలతో అభివృద్ధి చెందిన నిడుబ్రోలు రైల్వేస్టేషన్ పరిధిలో పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రయాణికులను ఆకర్షించేందుకు రైల్వే స్టేషన్‌ను అన్ని హంగులతో అందంగా తీర్చిదిద్దినా ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారికి, ముఖ్యంగా మహిళలను పలు సమస్యలు వేధిస్తున్నాయి. స్థానికంగా (రైల్వే స్టేషన్‌కు వెళ్లేదారిలో) ఉన్న సమస్యలను పరిష్కరించమని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌లోకి రావాలంటేనే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్టేషన్ ద్వారమంతా అపరిశుభ్రం.. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మందు బాబులకు అడ్డాగా మారింది. రాత్రి అయిందంటే స్టేషన్‌కు వెళ్లే రహదారి వెంబడి మందు బాబులు హల్‌చల్ చేస్తున్నారు. రోడ్డుపైనే మద్యం తాగుతుండటంతో ప్రయాణికులు రైలు ఎక్కేందుకు స్టేషన్‌కు వెళ్లే క్రమంలో ఇబ్బందులు పడుతున్నారు. మందు బాబులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పారిశుద్ధ్య సమస్య కూడా ప్రయాణికులను వేధిస్తోంది. రోడ్డు వెంబడి వ్యర్థాలు పేరుకుని ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. డివైడర్‌పై చెట్లు పెరిగి రోడ్డంతా అడవిని తలపిస్తోంది. ఈ సమస్యల కారణంగా ప్రయాణికుల రాకపోకలు పూర్తిస్థాయిలో తగ్గిపోతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఆ స్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గుంటూరు, బాపట్ల రైల్వే స్టేషన్లకు వెళ్లి రైలు ఎక్కుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ రోడ్డు ముఖ ద్వారంలోనే ప్రభుత్వ మద్యం దుకాణం ఉండి, పక్కనే దుకాణాల్లో వాటర్ బాటిళ్లు, సిగరెట్లు లభిస్తుండటంతో మద్యం ప్రియులు స్టేషన్ రహదారిలోనే మద్యం తాగుతుండటంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రైల్వే స్టేషన్ ద్వారంలో జఠిలంగా ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రయాణికులకు సౌకర్యవంతంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు వెంబడి ఉన్న వ్యర్థాలు



వైన్ షాప్ వద్ద దుకాణంలో కొనుగోలు చేస్తున్న వైనం

విజ్ఞాన్‌లో ‘డార్లింగ్’ యూనిట్ సందడి



డార్లింగ్ సినిమా హీరో, హీరోయిన్‌లతో విజ్ఞాన్ విద్యార్థులు



డార్లింగ్ సినీ యూనిట్‌తో విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శుక్రవారం సినీ హీరో ప్రియదర్శి తన ‘డార్లింగ్’ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సందడి చేశారు. యువ హీరో ప్రియదర్శి, హీరోయిన్ నభా నటేష్, దర్శకుడు అశ్విన్ రామ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డిలు నిర్మించారు. సినీ హీరో ప్రియదర్శి మాట్లాడుతూ విద్యార్థులే నా బలగమన్నారు. ఈ చిత్రం ఈ నెల 19న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు. విద్యార్థులందరూ డార్లింగ్ సినిమాను ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఈ చిత్రాన్ని స్ప్లిట్ పర్సనాలిటీ అనే డిజార్డర్‌ను ఆధారంగా చేసుకుని రొమాంటిక్.. కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించామన్నారు. ఈ సినిమాలో రొమాంటిక్ కామెడీ, యాక్షన్, ఎమోషన్స్, డ్రామా ప్రేక్షకులకు నచ్చుతాయన్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన నభా నటేష్ మాట్లాడుతూ ఇది తన మనసుకు బాగా దగ్గరైన సినిమా అని తెలియజేశారు. ఈ సినిమాలో తన పాత్ర ఇప్పటివరకు చేసిన పాత్రల కంటే వైవిధ్య భరితమైనదని వెల్లడించారు. ఈ సినిమాకి అశ్విన్ రామ్ దర్శకత్వం వహించగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా వివేక్ సాగర్, డీవోపీ నరేష్ రామదురై, ఎడిటర్‌గా ప్రదీప్ పనిచేసినట్లు తెలిపారు. అనంతరం డార్లింగ్ సినిమా యూనిట్ బృందాన్ని విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందించి చిత్రం అఖండ విజయం సాధించాలని ఆకాంక్షించారు.


ఆర్‌వీఆర్‌జేసీలో కమోడిటీ డెరివేటివ్స్‌పై సెమినార్



అతిథులను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: దేశ ఆర్థిక పురోగతి సాధనలో ఆలోచనాత్మక కమోడిటీస్ ట్రేడింగ్ ప్రధాన భూమిక పోషిస్తుందని మల్టీ కమోడిటీ ఎక్ఛైంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎంసీఎక్స్) సీనియర్ మేనేజర్ స్టేట్ హెడ్ ఎం.సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛైంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వస్తువుల వర్తక వ్యాపారంలో జరిగే ధరల హెచ్చుతగ్గులు.. ప్రపంచంలోని వివిధ దేశాలలో సంభవించే యుద్ధ వాతావరణం, ఎలక్షన్స్, వాతావరణ అనుకూలత, ప్రతికూలత వంటి వివిధ అంశాల ప్రభావాలపై ఆధారపడి ఉంటాయన్నారు. దానికి అనుగుణంగా పూర్తి పరిజ్ఞానంతో వస్తువుల ట్రేడింగ్‌లో అవగాహన పొందాలని విద్యార్థులకు సూచించారు. స్టాక్ మార్కెట్, ట్రేడింగ్, షేర్ మార్కెట్లలో సంభవించే వివిధ అంశాలను వాటిపై చూపే ప్రభావాలను వివరించారు. భారత దేశాన్ని సుసంపన్నమైన దేశ నిర్మాణం దిశగా విద్యార్థులు వర్తక వ్యాపార విజయంలో సులభతర ఆలోచనలు చేయాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ కోరారు. దేశంలోని అత్యంత ప్రజాదరణ పొందిన కమోడిటీ ఎక్ఛైంజ్‌లలో ప్రధాన సంస్థలలో ఒకటైన మల్టీ కమోడిటీ ఎక్ఛైంజ్ నిపుణుల బృందం తమ కళాశాల విద్యార్థులకు సందేశాన్ని అందించటం సంతోషకరమని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ సజ్జా రాధిక, డాక్టర్ మహేంద్ర వర్మ తదితరులు అతిథులను ఘనంగా సన్మానించారు.

కౌలు రైతులు సీసీఆర్ కార్డులు పొందాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: కౌలు చేస్తున్న ప్రతి కౌలు రైతులు పంట సాగుదారు హక్కు పత్రం(సీసీఆర్‌సీ) విధిగా పొందాలని, అందుకు గ్రామంలోని వ్యవసాయాధికారులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రైతులకు సీసీఆర్ కార్డులపై అవగాహన కల్పించి వందకు వంద శాతం కౌలు కార్డులు అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అడిగిన ప్రశ్నలకు అధికాలు సమాధానాలిచ్చారు. ముందుగా మండలస్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు బొల్లిముంత పోతురాజు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తాడికొండ: అప్పుల బాధతో పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడికొండ మండలం పాములపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాములపాడు గ్రామానికి చెందిన కొల్లూరు అశోక్(48) రైతు. కొన్ని సంవత్సరాలుగా సాగులో వరుస నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యారు. ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

బాజీబాబా దర్గా అటెండర్ మృతి

పెదకాకాని: అనారోగ్యంతో బాజీబాబా దర్గా అటెండర్ షేక్ అబ్దుల్ సత్తార్ (53) మృతి చెందినట్లు దర్గా ఈవో షేక్ ముక్తార్ బాషా తెలిపారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాలో అటెండర్‌గా అబ్దుల్ సత్తార్ దీర్ఘకాలంగా పని చేసి దర్గా అభివృద్ధిలో తన వంతు కృషి చేశాడు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. దర్గా ఈవో షేక్ ముక్తార్ బాషా, సిబ్బంది అబ్దుల్ మృతదేహానికి నివాళులర్పించి, మృతుని కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రేపు కంటి సమస్యలపై అవగాహన సదస్సు

గుంటూరు మెడికల్: ఈ నెల 14న ‘రెటినోపతి ఉచిత పరీక్ష శిబిరం – శాస్త్రీయ అవగాహన సభ’ నిర్వహించనున్నట్లు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు 2/1 బ్రాడీ పేటలోని ఎస్.హెచ్.ఒ భవనంలో నిర్వహించే ఈ శిబిరంలో డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ డాక్టర్ రాచపల్లి కల్పనారెడ్డి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. వైద్య సలహాలు అందజేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

గుండె సమస్యల నివారణపై సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలోని సెమినార్ హాల్లో శుక్రవారం కళాశాల విస్తృతి కార్యాచరణ విభాగ ఆధ్వర్యంలో గుండె సమస్యలు–నివారణ మార్గాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ హాస్పిటల్స్‌కు చెందిన హృద్రోగ నిపుణులు డాక్టర్ నాగ శ్రీహరిత, డాక్టర్ షుకూర్ చిలకపాటి పాల్గొని గుండెకు సంబంధించిన వివిధ సమస్యలు, నివారణ పద్ధతులను వివరించారు. గుండె ఆరోగ్యంగా ఉండేందుకు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు, ఆహార పద్ధతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ పి.గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆటో స్టాండ్ ప్రారంభం



లక్ష్మీపురం: ది గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ - వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఎదురుగా గాంధీ పార్క్ వద్ద నూతన ఆటో స్టాండ్‌ను యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. యూనియన్ నగర అధ్యక్షుడు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, నగర అధ్యక్షుడు కూరాకుల రాంప్రసాద్ పాల్గొని, ప్రసంగించారు. నగర ప్రధాన కార్యదర్శి మంగా శ్రీనివాసరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. స్టాండ్ ఇన్‌చార్జి దామరపల్లి వెంకటరావు, అధ్యక్షుడు పసల వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ రాచకొండ బుల్లిబాబు, కార్యదర్శి అల్లూరి వెంకటకృష్ణ, సహాయ కార్యదర్శి పలకలూరి కోటేశ్వరరావు, కోశాధికారి కన్నబోయిన శ్రీకాంత్ పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా ప్రకృతి వ్యవసాయానిదే



గానుగ నూనె తీసే విధానాన్ని ఎమ్మెల్యే రామాంజనేయులుకు వివరిస్తున్న రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు

గుంటూరు రూరల్: భవిష్యత్‌లో ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత కలుగుతుందని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో కర్షక్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో సిరి ధాన్యాలతో జీవన సిరి అనే అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రజల ఆరోగ్యంతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఉన్న పరిస్థితులను బట్టి అప్పట్లో పెరుగుతున్న ప్రజల ఆహార అవసరాలను తీర్చాల్సిన పరిస్థితులలో హరిత విప్లవం పేరుతో వ్యవసాయంలో సంకరజాతి విత్తనాలు, రసాయనాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఎలాంటి రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించగలిగితే మన ఆహార అవసరాలు తీర్చుకోవడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించే పంటల దిగుబడులలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ప్రస్తుతం ప్రజల ఆరోగ్యం మెరుగుపడి, వైద్య ఖర్చులు తగ్గాలంటే సిరి ధాన్యాల ఆహారమే సరైన దారని డాక్టర్ సరళఖాదర్ తెలిపారు. కార్యక్రమంలో మన్నవ పూర్ణయ్య, కొప్రాటి నాగేశ్వరరావు, పత్తి భవన్నారాయణ, నాగిసెట్టి నాగరాజు, గింజుపల్లి వేంకటేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన పలువురు విద్యార్థినులు



కూచిపూడి నిఖిత



వి.సుస్మిత



తుళ్ళూరి జాహిత



తక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు

పెదకాకాని: పది పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో సీట్లు ప్రకటించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కూచిపూడి నిఖిత(574), వి.సుస్మిత(505) మార్కులతో పది ఫలితాల్లో ఉత్తీర్ణులయ్యారు. అలాగే మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన తుళ్ళూరి జాహిత (506) మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఈ ముగ్గురు వారి కేటగిరీల ఆధారంగా సీట్లు సాధించినట్లు విద్యా శాఖ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా శుక్రవారం తక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన కూచిపూడి నిఖిత, వి.సుస్మితలను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తక్కెళ్ళపాడు పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీలో ఇప్పటికే చాలా మంది విద్యార్థులు సీట్లు సాధించి ప్రయోజకులయ్యారన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ట్రిపుల్ ఐటీ సీట్లు గొప్ప వరమన్నారు. ఆరు సంవత్సరాల పాటు ఉచిత బోధనతో పాటు హాస్టల్, భోజన వసతి ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బార్ సిబ్బందిపై దాడి.. కేసు నమోదు

తెనాలిరూరల్: మద్యం తాగి బార్‌లో పని చేస్తున్న సిబ్బందిపై దాడి చేసిన యువకుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా గురజాలకు చెందిన చింతా మణికుమార్ మరో ఇద్దరు స్నేహితులతో కలసి తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రముఖ బార్‌కు గురువారం రాత్రి వచ్చాడు. రాత్రి పొద్దుపోయాక మిగిలిన ఇద్దరు మద్యం తాగి వెళ్లిపోగా, మణికుమార్ జారుకునే ప్రయత్నం చేశాడు. పసిగట్టిన బార్ సిబ్బంది అతన్ని అటకాయించడంతో వారిపై దాడి చేసి గాయపర్చాడు. బార్ నిర్వాహకులు, సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణం తొలగించాలంటూ స్థానికుల ఆందోళన

- కోర్టు స్టే తెచ్చుకున్న నిర్వాహకుడు
- తాళం వేసి శాంతిపజేసిన మున్సిపల్, పోలీసు అధికారులు



షాపు ముందు ఆందోళన చేస్తున్న స్థానికులు

తెనాలిఅర్బన్: మున్సిపల్ స్థలంలో ఉన్న దుకాణాన్ని తొలగించాలంటూ స్థానికులు శుక్రవారం ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న మున్సిపల్, పోలీసు అధికారులు అక్కడకు చేరుకుని షాపును తాత్కాలికంగా మూసివేయించి ఆందోళన విరమింపజేశారు. మున్సిపల్ అధికారుల కథనం ప్రకారం నందులపేట ఎన్‌టీఆర్ బొమ్మ సెంటర్‌లో అంచ నరేంద్రకుమార్ సమీపంలోని మున్సిపల్ స్థలంలో శ్రీహరి జనరల్ అండ్ ఫ్యాన్సీ స్టోర్స్ ఏర్పాటు చేసుకున్నానని వ్యాపారం నిర్వహిస్తున్నారు. స్థానికులతో అతనికి విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానికులు శుక్రవారం షాపు ముందు ధర్నా చేశారు. అలాగే షాపులోని వస్తువులు కొన్నింటిని పగులకొట్టారు. వెంటనే షాపు ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు జడ్.సుధాకర్, సుబ్బారావు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అలాగే వన్‌టౌన్, టు టౌన్ సీఐలతో పాటు పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. షాపును తొలగించవద్దు అంటూ కోర్టునుంచి స్టే ఆర్డర్ ఉండటం వలన దానిని తొలగించలేకపోయమని మున్సిపల్ అధికారులు పోలీసులకు తెలియజేశారు. ఈ నెల 25న వాయిదా ఉందని, ఆ సమయంలో న్యాయమూర్తి ఇచ్చే తీర్పు ఆధారంగా నడుచుకుంటామని చెప్పారు. దీనికి శాంతించని ఓ మహిళ పెట్రోలు పోసుకునేందుకు ప్రయత్నించింది. దీనిని గమనించిన పోలీసులు బాటిల్‌ను లాక్కుని పారపోశారు. అనంతరం స్థానికుల కోరిక మేరకు షాపుకు తాళాలు వేశారు. తాము చెప్పే వరకు తాళాలు తీయవద్దని షాపు నిర్వాహకుడికి సూచించారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

లక్ష్మీపురం: యువత ప్రాణాలతో చెలగాటమాడుతున్న గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గుంటూరు నగరంలోని కొత్తపేట భగత్ సింగ్ కూడలి వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాల చైతన్య మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారంలో మత్తు పదార్థాలను అరికడతామని ప్రజలకు హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి యువకుల ప్రాణాలను కాపాడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అరుణ్, మట్టిపల్లి కిరణ్, నాయకులు పాల్గొన్నారు.